

గ్రూప్‌-2 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- హాజరుకానున్న 26,977 మంది అభ్యర్థులు
- 56 పరీక్షా కేంద్రాలు.. ఒక్కో సెంటర్‌కు డిపార్ట్‌మెంటల్‌ అధికారి
- 56 ఫ్లయింగ్‌ స్క్వాడ్స్‌, జాయింట్‌ రూట్స్‌ ఆఫీసర్ల నియామకం
- గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి

కరీంనగర్‌, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్‌-2 పరీక్షలకు జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. జిల్లా కలెక్టర్‌ పమేలా సత్పతి ఆధ్వర్యంలో పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు 56 మంది డిపార్ట్‌మెంట్‌ అధికారులను, 56 మంది ఫ్లయింగ్‌ స్క్వాడ్స్‌, 56 మంది జాయింట్‌ రూట్‌ ఆఫీసర్లను నియమించి వారికి పరీక్ష నిర్వహణపై ప్రత్యేక శిక్షణ అందించారు. టీజీపీఎస్సీ అభ్యర్థుల హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు ఉదయం పరీక్షకు 8:30 నుంచి, మధ్యాహ్నం పరీక్షకు 1:30 గంటల నుంచి అనుమతిస్తారు. పరీక్షా కేంద్రాల గేటు ఉదయం 9:30 గంటలకు, మధ్యాహ్నం 2:30 గంటలకు మూసివేస్తారని, ఆ తర్వాత ఎవరిని అనుమతించరు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు తమ వెంట బ్లూ/బ్లాక్‌ పాయింట్‌ పెన్నులు, ఫొటోతో కూడిన హాల్‌టికెట్‌, ప్రభుత్వం జారీ చేసిన ఒరిజినల్‌ ఫొటో ఐడీ కార్డు తీసుకురావాల్సి ఉంటుంది. హాల్‌టికెట్‌పై పాస్‌పోర్టు సైజ్‌ ఫొటో ముద్రించి తీసుకెళ్లాలి. ఒకే హాల్‌టికెట్‌ను పరీక్ష మొత్తం వినియోగించాల్సి ఉంటుంది. హాల్‌టికెట్‌లో ఫొటో సరిగా లేకపోతే అభ్యర్థి మూడు పాస్‌పోర్టు సైజ్‌ ఫొటోలు గెజిటెడ్‌ అధికారి లేదా చివర చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపాల్‌ సంతకంతో తీసుకువచ్చి పరీక్షాహాల్‌లో ఇన్విజిలేటర్‌కు అప్పగించాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు క్యాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్‌, పెన్‌డ్రైవ్‌, బ్లూ టూత్‌ డివైసెస్‌, జువెల్లరీ, ఎలక్ట్రానిక్‌ గాడ్జెట్‌ మొదలగు సామగ్రి అనుమతించరు. చెప్పులు మాత్రమే వేసుకుని రావాలని, షూస్‌ వేసుకోవద్దని టీజీపీఎస్సీ సూచించింది. సెల్‌ఫోన్‌ బ్లూటూత్‌ ఇతర ఎలక్ట్రానిక్‌ గాడ్జెట్స్‌ అభ్యర్థులు తీసుకువచ్చినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు. బయోమెట్రిక్‌ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్ష హాల్‌ విడిచి వెళ్లరాదు. బయోమెట్రిక్‌ ఇవ్వని అభ్యర్థుల ఓఎంఆర్‌ షీట్‌ అనుమతించరు. బయోమెట్రిక్‌ విధానం ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు మెహందీ టాటూ వంటివి పెట్టుకోవదని టీజీపీఎస్సీ సూచించింది. ప్రతి పేపర్‌ సమయంలో అభ్యర్థి ఇన్విజిలేటర్‌ సమక్షంలో హాల్‌టికెట్‌పై సంతకం పెట్టాల్సి ఉంటుంది.



అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి

- జిల్లా కలెక్టర్‌ పమేలా సత్పతి



అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి నిర్దేశిత సమయానికంటే గంట ముందే చేరుకోవాలి.మోడల్‌ ఓఎంఆర్‌ షీట్లను వెబ్‌సైట్‌ నుంచి డౌన్‌లోడ్‌ చేసుకుని సరిగ్గా బబుల్స్‌ చేయడం ప్రాక్టీస్‌ చేయాలి. ఓఎంఆర్‌ షీట్‌ను సరిగా చెక్‌ చేసుకోవాలి. పరీక్ష ముగిసే వరకు అభ్యర్థులు పరీక్షా హాల్‌ను విడిచి వెళ్లవద్దు. టీజీపీఎస్సీ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి.

ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్‌ క్రీడలు దోహదం

- సీఎం కప్‌ క్రీడలను విజయవంతం చేయాలి
- డీఈవో సీహెచ్‌వి జనార్దన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సీహెచ్‌వి జనార్దన్‌రావు

కరీంనగర్‌ స్పోర్ట్స్‌, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువత, క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్‌ పోటీలు దోహదపడతాయని జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్‌వి జనార్దన్‌రావు అన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి నిర్వహించనున్న సీఎం కప్‌ క్రీడల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ స్టేడియంలో వ్యాయామ ఉపాధ్యాయులతో క్రీడల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్‌ క్రీడలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రపంచస్థాయికి అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ క్రీడల్లో గ్రామస్థాయి నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. దాదాపు 30 క్రీడాంశాల్లో పోటీలను జిల్లా కలెక్టర్‌ ఆదేశాలతో క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని తెలిపారు. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు ఈ పోటీల నిర్వహణలో పాలుపంచుకొని పోటీలను విజయవంతం చేయాలని సూచించారు. పోటీల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైందన్నారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బి శ్రీనివాస్‌గౌడ్‌ మాట్లాడుతూ 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జిల్లాస్థాయి క్రీడలను నిర్వహిస్తున్నామని, ఈ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు మధ్యాహ్నం ఉచిత భోజన వసతిని కలెక్టర్‌ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఒలంపిక్‌ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, పాఠశాలల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్‌, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు అంతడ్పుల శ్రీనివాస్‌, సొల్లు సారయ్య, ఎండి యూనిస్‌ పాష, అంతటి శంకరయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



లేబర్‌ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మిక నాయకులు

భగత్‌నగర్‌, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్నర భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ బిల్డింగ్‌ కన్‌స్ట్రక్షన్‌ వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు కటిరెడ్డి బుచ్చన్న యాదవ్‌, ప్రధానకార్యదర్శి పిట్టల సమ్మయ్య డిమాండ్‌ చేశారు. శుక్రవారం నగరంలోని జిల్లా లేబర్‌ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌ ఫైళ్ల డబ్బులను వెంటనే చెల్లించాలన్నారు. ఆన్‌లైన్‌ సర్వీసెస్‌ డేటా ఎనిమిదో నెల తొమ్మిదో నెలలో అప్లై చేసిన క్లైయిమ్స్‌ తిరిగి చేయాలనడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టల రామస్వామి, గోదారి లక్ష్మణ్‌, తిరుపతి, కులాని తిరుపతి, ఎండి రజాక్‌, ఎండి ఏబాస్‌, శనిగరం నరేష్‌, గామినేని సత్యం, రమేష్‌, లక్ష్మణ్‌ యాదవ్‌, కత్తి రాములు, ఎల్లయ్య, నలువాల సమ్మయ్య, సందెల శ్రవణ్‌; అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మెప్మా సిబ్బందిని అడ్డుకున్న పోలీసులు



రేణికుంట టోల్‌గేట్‌ వద్ద నిరసన తెలుపుతున్న మెప్మా సిబ్బంది

తిమ్మాపూర్‌, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ హైదారాబాద్‌లో ధర్నాకు వెళ్తున్న మెప్మా సిబ్బంది, రిసోర్స్‌ పర్సన్‌లను రాజీవ్‌రహదారిపై రేణికుంట టోల్‌గేట్‌ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్న వీరిని పోలీసులు అడ్డుకొని తిరిగి వెనక్కి పంపారు. ఈ సందర్భంగా మెప్మా సిబ్బంది కొద్దిసేపు రోడ్డు పక్కన బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కష్టానికి ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు నెలలుగా జీతాలు రావడం లేదని, తమ బాధ చెప్పుకునేందుకు హైదారాబాద్‌కు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు.

ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా

- నగర మేయర్‌ వై సునీల్‌రావు

కరీంనగర్‌ టౌన్‌, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో లోలెవల్‌, హైలెవల్‌ జోన్లలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రజలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేస్తామని నగర మేయర్‌ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ మంచినీటి సరఫరాలో ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధానంగా లో లెవల్‌ నీటి సరఫరాలో తరచుగా సమస్యలు తలెత్తుతు న్నప్పటికీ ప్రస్తుతం ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నీటి శుద్ధీకరణ కేంద్రంలో గతంలో రెండు 350 హెచ్‌పి సామర్థ్యం కలిగిన మోటార్లు పనిచేస్తుండగా తరచుగా బ్రేక్‌ డౌన్‌ కారణంగా స్టాండ్‌ బై మోటార్లు లేక ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. అలాంటి సమస్య పునరావృతం కాకుండా కొత్తగా మరో 350 హెచ్‌పి మోటారును బిగించి వినియోగంలోకి తెచ్చామన్నారు. అలంతేకాకుండా 3150 హెచ్‌పి సామర్థ్యం గల మోటారు పంపులను కూడా వినియోగం చేస్తున్నట్లు తెలిపారు. 350, 150 కెపాసిటీ కలిగిన మొత్తం ఆరు మోటారు పంపులు ఫిల్టర్‌ బెడ్‌లో పనిచేయడం జరుగుతుందని తెలిపారు. ప్యానల్‌ బోర్డులో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎక్కడ సమస్యలు రాకుండా నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటుందన్నారు. ఆయన వెంట నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.



ఫిల్టర్‌ బెడ్‌లో మోటార్లను పరిశీలిస్తున్న మేయర్‌ వై సునీల్‌రావు

అణగారిన వర్గాలకు సీపీఐ అండ

- జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

భగత్‌నగర్‌, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సమ సమాజ స్థాపన కోసం దోపికిడికి గురవుతున్న అనగారిన వర్గాలకు అండగా సీపీఐ ఉంటుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ఎల్‌ఐసీ ఏజెంట్ల సంఘ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యవర్గ, సీపీఐ కౌన్సిల్‌ సభ్యులు, గ్రామశాఖ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సీపీఐ శత జయంతి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండాలనే సంకల్పంతో దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా మార్క్సిజం సిద్ధాంత పునాదులపై భారతకమ్యునిస్టు పార్టీ ఏర్పడిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వామపక్ష కమ్యునిస్టు భావాలు కలిగిన దేశాల్లో ఆదరణ పెరుగుతుందని అందుకు నిదర్శనం శ్రీలంక ఎన్నికలే అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ సీపీఐ పార్టీని విస్తృత పరచడానికి జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, మండలాల్లో సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలన్నారు. పార్టీని, ప్రజా సంఘాలను బలోపేతం చేసుకునే దిశగా సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్‌కుమార్‌, బోయిని అశోక్‌, అందె స్వామి, గూడెం లక్ష్మి, టేకుమల్ల సమ్మయ్య, బత్తుల బాబు, కౌన్సిల్‌ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

విషపూరిత మొక్కలు తొలగించాలని కలెక్టర్‌కు వినతి

భగత్‌నగర్‌, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో ఉన్న పర్యావరణ కాలుష్యాన్ని కలిగించే విషపూరిత మొక్కలను తొలగిం చాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌ పమేలా సత్పతికి ఆదరణ సేవా సమితి అధ్యక్షురాలు కర్రె పావనిరవి ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్ర మంలో సంస్థ సభ్యులు గుంటి మౌనిక, కర్రె లాస్య, గడ్డల కోమలత, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్‌ పమేలా సత్పతికి వినతి పత్రం అందిస్తున్న ఆదరణ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

- విద్యార్థుల భోజనానికి మెనూ విడుదల : కలెక్టర్‌

గణేష్‌నగర్‌, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన విద్యార్థుల డైట్‌ను జిల్లా కలెక్టర్‌ పమేలా సత్పతి ప్రకటించారు. నెలలో నాలుగు వారాలకు నాలుగు రకాల మెనూ సిద్ధం చేశారు. వారంలో ఏడు రోజులకు బ్రేక్‌ఫాస్ట్‌, లంచ్‌, స్నాక్స్‌ డిన్నర్‌లలో వేర్వేరు మెనూలను విద్యార్థులకు నూతనంగా అందించనున్నారు.

ఇండోర్‌ స్టేడియం లీజు ఆలోచన విరమించుకోవాలి

- ఏఐవైఎఫ్‌ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగేందర్‌

కరీంనగర్‌ స్పోర్ట్స్‌ డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని అంబేద్కర్‌ స్టేడియంలోని ఇండోర్‌ స్టేడియం బ్యాడ్మింటన్‌ కోర్టును, స్కేటింగ్‌ రింగ్‌ను ప్రభుత్వం లీజుకు ప్రైవేట్‌కు వ్యక్తులకు ఇవ్వడాన్ని ఏఐవైఎఫ్‌ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మ ణపల్లి యుగేందర్‌ తీవ్రంగా ఖండించారు. లీజు ఆలోచనను విరమించుకోవాలని డీవైఎస్‌వోకు వినతిపత్రాన్ని అందజేశారు. అంబేద్కర్‌ స్టేడియం ప్రభుత్వ ఆస్తి అని, ఇందులో ప్రైవేట్‌ వ్యక్తులకు ఎలాంటి హక్కు లేదని, ప్రైవేట్‌ వ్యక్తులకు ప్రభుత్వ సంస్థను లీజుకు ఇచ్చే ఆలోచనను విరమించుకోవాలని, లేనిపక్షంలో పోరాటాలు తప్పవని ఆయన హెచ్చరించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల క్రీడాకారులు ఆడుకోవడానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం బ్యాడ్మింటన్‌ కోర్టును, స్కేటింగ్‌ రింగ్‌ను లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిందని, వీటిని ప్రైవేట్‌ వ్యక్తులకు ఇవ్వడం దుర్మార్గమన్నారు. లేనిపక్షంలో క్రీడాకారులను ఐక్యపరిచి ఉద్యమాలు చేస్తామని యుగేందర్‌ హెచ్చరించారు.

కేజీబీవీ పాఠశాలను సందర్శించిన డీఈవో



మానకొండూర్‌ కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌

తిమ్మాపూర్‌, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌ మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంను జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో డైనింగ్‌ హాల్‌, కిచెన్‌ షెడ్‌ను పరిశీలించారు. భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. మెనూ అమలు గురించి తెలుసుకున్నారు. ధర్నాలో పాల్గొంటున్న టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ స్టాఫ్‌ వివరాలను తెలుసుకున్నారు. వంట సిబ్బందితో ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని. వంటకు ఉపయో గించే నీరు నిలువ ఉండే నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ, శుభ్రం చేసిన తేదీని ట్యాంకు మీద ప్రదర్శించాలని ఆదేశిం చారు. టీచింగ్‌ స్టాఫ్‌ ధర్నాలో పాల్గొంటున్న నేపథ్యంలో విద్యార్థులకు తరగతుల నిర్వహణ విషయంలో ఇబ్బంది కలగకుండా తాత్కాలికంగా వేరే ఉన్నత పాఠశాలల నుంచి మహి ళా ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మధుసూధనా చారి, జీసీడీవో కృపారాణి పాల్గొన్నారు.

‘కళ’తప్పిన చిందు యక్షగానం

- గుర్తింపు లేక కళాకారుల దీనస్థితి
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- ఆదుకోవాలని వినతి

- కరీంనగర్‌ కల్చరల్‌, ఆంధ్రజ్యోతి:

7



విద్యుత్‌ ఉద్యోగుల నిరసన

గణేశ్‌నగర్‌,డిసెంబర్‌ 13(ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్‌, ఛత్తీస్‌గడ్‌ రాష్ట్రాలలో విద్యుత్‌ సంస్థలను ప్రైవేటీకరించే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్న సందర్భంగా విద్యుత్‌ ఉద్యోగులు శుక్రవారం నిరసన కార్యక్రమాలను చేపట్టారు. జిల్లా విద్యుత్‌ కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్‌ ఐక్య కార్యాచరణ సమితి పిలుపుమేరకు మధ్యాహ్న సమయంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్‌ సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా ప్రైవేట్‌ పరం చేస్తూ ఇప్పుడు విద్యుత్‌ సంస్థలను కూడా ప్రైవేటు వారికి అప్పజెప్పడానికి చూస్తోందన్నారు. మొదటగా బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఉత్తరప్రదేశ్‌, ఛత్తీస్‌గడ్‌లో శీతాకాల సమావేశాలలో పార్లమెంటులో బిల్లు పెట్టే యోచన ఉందని ఈ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడుతామని అన్నారు. విద్యుత్‌ ఉద్యోగులతో పాటు విద్యుత్‌ సబ్సిడీ పొందుతున్న బడుగు బలహీన వర్గాలు, రైతులు రాజకీయ నాయకులు కలిసి రావాలని కోరారు. ఈ కార్యకంలో జేఏసీ నాయకులు కె అంజయ్య, ఎస్‌ అంజయ్య, వీరయ్య, శ్రీనివాస్‌, సంపత్‌కుమార్‌, రమేష్‌, కిరణ్‌, సత్యనారాయణ , శ్రీనివాస్‌, మల్లేశం డివిజనల్‌ ఇంజనీర్స్‌ తిరుపతి, రమణారెడ్డి రఘునందన్‌, భూమయ్య ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యుత్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్‌ ఉద్యోగులు

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

శంకరపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన క్యాదాసి సంపత్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సంపత్ గతనెల 17న తన మోటర్ సైకిల్‌పై ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల వద్ద ఆరా తీశారు. ఆచూకీ లభించక పోవడంతో సంపత్ భార్య క్యాదాసి స్రవంతి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

గుండెపోటుతో ఒకరి మృతి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన పెద్దూరి మల్లయ్య (56) అనే రజకుడు దుస్తులు ఇస్త్రీ చేస్తూ శుక్రవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. గ్రామానికి చెందిన మల్లయ్య తన కుల వృత్తిలో భాగంగా స్థానికంగా ఓ డబ్బాను ఏర్పాటు చేసుకొని దుస్తులు ఇస్త్రీ చేసేవాడు. రోజులాగే డబ్బాలో దుస్తులను ఇస్త్రీ చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలి చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రజక సంఘం నాయకులు, స్థానికులు కోరారు.

ఆర్థిక ఇంబందులతో యువకుడి ఆత్మహత్య..

ముస్తాబాద్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కంచం సురేశ్(29) అనే యువకుడు శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గణేశ్ వివరాల ప్రకారం.. పోతుగల్‌కు చెందిన సురేశ్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సురేశ్ తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపు నొప్పితో వివాహిత ఆత్మహత్య

వేములవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణానికి చెందిన సోమినేని మౌనిక (30) అనే వివాహిత కడుపునొప్పితో బాధ పడుతూ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన మౌనిక కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మౌనిక తండ్రి తిరుపతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ప్రకటనలో తెలిపారు.

మినీ ఏటీఎం కేంద్రాలే టార్గెట్..



- బిర్యాణి, ఫాస్ట్‌ఫుడ్ ఆర్డర్ల పేర టోకరా
- బ్యాంకు సెలవు రోజుల్లోనే మోసాలు
- గోదావరిఖని, పెద్దపల్లిల్లో వరుస ఘటనలు

కోల్‌సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్కీమ్‌లు, లాటరీలు, బ్యాంకు రుణాల పేరిట మోసాలకు పాల్పడిన సైబర్ నేరస్థులు కొత్త తరహాలో మోసగించేందుకు ఎత్తులు వేస్తున్నారు. ఫోన్లలో స్థానికులుగా పరిచయం చేసుకుంటూ నమ్మబలుకుతున్నారు. స్థానికంగా ప్రముఖులు, వ్యాపారస్థుల పేర్లు చెప్పి మాటల్లోకి దించుతున్నారు. ఇటీవల ఆన్‌లైన్ నగదు బదిలీ కేంద్రాలు, మినీ ఏటీఎంలలో క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులతో నగదు బదిలీ అవుతుండడాన్ని ఆసరాగా చేసుకుని వాటినే టార్గెట్‌గా చేస్తున్నారు. ఫుడ్ ఆర్డర్ల పేర ఏక కాలంలో రెస్టారెంట్ల నిర్వాహకులు, మినీ ఏటీఎం నిర్వాహకులకు ఒకరికి తెలియకుండా ఒకరికి ఫోన్లు చేసి టోకరా వేస్తున్నారు. నిమిషాల్లోనే మాయచేసి వేలకు వేలు దండుకుంటున్నారు. బ్యాంకుల సెలవు రోజులనే టార్గెట్‌గా చేసుకుని బురిడీ కొట్టిస్తున్నారు. గోదావరిఖని, పెద్దపల్లిల్లో ఈ తరహా వరుస ఘటనలు చోటు చేసుకున్నాయి.

● పది నిమిషాల వ్యవధిలోనే

అదే రోజు పది నిమిషాల వ్యవధిలోనే గోదావరిఖని మెయిన్ రోడ్డులోని ఒక మినీ ఏటీఎం సెంటర్ నిర్వాహకుడికి ఫోన్ చేసిన సైబర్ నేరస్థుడు తాను మార్కండేయ కాలనీలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి ఎండీనని, తనకు పెట్రోల్‌బంక్‌లు, ఇతర వ్యాపారాలు ఉన్నాయని నమ్మబలికాడు. వరుసగా బ్యాంకులకు సెలవులు ఉన్నాయని, అందువల్ల తనకు డబ్బులు బదిలీ చేయాల్సిన అవసరం ఉందన్నాడు. తన ఉద్యోగి వస్తాడని, కమీషన్ తీసుకుని మిగతా డబ్బులు తన అకౌంట్‌లోకి పంపాలని సూచించాడు. అదే సమయంలో మినీ ఏటీఎం దగ్గరే ఉన్న మరో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమానికి ఫోన్ చేసి తనకు కొన్ని పార్సల్స్ అవసరమని, డబ్బులు పక్కనే ఉన్న మినీ ఏటీఎం నుంచి తీసుకోవాలని అతనికి సూచించాడు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు మినీ ఏటీఎం వద్దకు వెళ్లగా ఏటీఎం నిర్వాహకుడు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడిని తనకు ఫోన్ చేసిన ఆసుపత్రి ఎండీ వద్ద పనిచేసే ఉద్యోగిగా భావించాడు. అతడు రావడంతోనే రూ.55వేల సొమ్మును ఆసుపత్రి ఎండీగా చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేశాడు. ముందున్న వ్యక్తే తనకు పార్సిళ్ల డబ్బులు ఇవ్వమని ఏటీఎం నిర్వాహకున్ని అడగడంతో అవాక్కయ్యాడు. మోసపోయానని గుర్తించి సైబర్ నేరస్థుడు చేసిన ఫోన్ నంబర్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. సైబర్ క్రైమ్ నెం.1930కు ఫోన్ చేసి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● జిల్లా కేంద్రంలోనూ..

ఇటీవల పెద్దపల్లిలోని ఒక నగదు బదిలీ కేంద్రం నిర్వాహకుడికి ఇదే తరహాలో సైబర్ నేరస్థుడు బురిడీ కొట్టించాడు. తనకు 100బిర్యాణి ప్యాకెట్లు అవసరమని ఫోన్‌లో ఆర్డర్ చేశాడు. అడ్వాన్స్ ఇవ్వాలని బిర్యాణి సెంటర్ నిర్వాహకుడు కోరడంతో భూంనగర్‌లోని మీ సేవ కేంద్రానికి వెళితే రూ.10వేలు ఇస్తాడని, మిగిలిన సొమ్మును తాను ఫోన్‌పే చేస్తానని నమ్మించాడు. అదే సమయంలో ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడికి ఫోన్ చేసిన అగంతకుడు తాను ఒకవ్యక్తి ద్వారా నగదు పంపిస్తున్నానని, ఆన్‌లైన్‌లో బదిలీ చేయాలని సూచించాడు. మీసేవ సెంటర్ నిర్వాహకుడు పని మీద బయటకు వెళుతూ షాపులో పని చేస్తున్న వ్యక్తికి తన పేరు చెప్పి ఎవరైనా వస్తే నగదు బదిలీ చేయాలని సూచించాడు. బిర్యాణి సెంటర్ నిర్వాహకుడు మీసేవా కేంద్రానికి వెళ్లి తనకు ఫోన్ చేసిన వ్యక్తికి మరోసారి ఫోన్‌చేసి మీ సేవలో పని చేస్తున్న వ్యక్తికి ఫోన్ ఇచ్చాడు. నేను మీ యజమానితో మాట్లాడాను, నేను చెప్పిన నంబర్లకు డబ్బులు బదిలీ చేయమనడంతో షాపులో పనిచేస్తున్న వ్యక్తి మూడు నంబర్లకు మొత్తం రూ.55వేలు బదిలీ చేశాడు. మీ ముందున్న వ్యక్తి నగదు ఇస్తాడు, తీసు కోండని ఫోన్ కట్ చేశాడు. ముందున్న వ్యక్తిని డబ్బులు ఇవ్వమని అడుగగా తాను బిర్యాణి సెంటర్ నిర్వాహ కుడినని, తాను డబ్బులు ఇవ్వడం ఏంటి? మీ దగ్గర డబ్బులు తీసుకోమని కస్టమర్ చెబితే వచ్చానని తెలు పడంతో మోసపోయామని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● బిర్యాణి పాయింట్ల పేరుతో..

సైబర్ నేరస్థులు ప్రజల అవసరాలు, నమ్మకాలను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. మినీ ఏటీఎంలలో ఆర్థిక లావాదేవీలు ఎక్కువగా సాగుతుండడంతో వాటినే లక్ష్యంగా చేసుకుంటున్నారు. అను మానం రాకుండా తెలుగులో మాట్లాడుతూ స్థానికంగా పరిచయం ఎక్కువ ఉన్న వ్యాపారులు, ఆసుపత్రి నిర్వాహకుల పేర్లను వాడుకుంటున్నారు. ముఖ్యంగా బ్యాంకు సెలవు దినాల్లో ఆన్‌లైన్ నగదు బదిలీ సెంటర్లకు గిరాకీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడం, రద్దీ సమయాల్లో నిర్వాహకులను ఏమార్చి బురిడీ కొట్టిస్తున్నారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఒక ప్రముఖ బిర్యాణి సెంటర్ నిర్వాహకులకు రెండు నెలలక్రితం ఫోన్ చేసిన సైబర్ నేరస్థుడు పట్టణానికి చెందిన ఒక కాంట్రాక్టర్‌గా చెప్పుకున్నాడు. తాను చిన్న పార్టీ ఇస్తున్నానని, 55బిర్యాణి పార్సిళ్లు అవసరమని పేర్కొన్నాడు. బ్యాంకు సెలవు దినాలు కనుక నగదు లేదని, సమీపంలోని మినీ ఏటీఎం పేరు చెప్పి అక్కడికి వెళ్లి డబ్బులు తీసుకోవాలని సూచించాడు. సంబంధిత మినీ ఏటీఎంకు ఫోన్ చేసి తాను ఒక మనిషిని పంపుతున్నానని, అతడు నగదు ఇస్తాడని, కమీషన్ ఎక్కువైనా తీసుకుని మిగతా డబ్బులు తన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయమని చెప్పాడు. బిర్యాణి సెంటర్ నిర్వాహకుడికి గానీ, మినీ ఏటీఎం నిర్వాహకుడికి గానీ అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాడు.

బిర్యాణి సెంటర్ నిర్వాహకుడు తమకు ఫోన్ చేసిన కాంట్రాక్టర్ ఆర్డర్ తాలుకా డబ్బు లు ఇస్తారని ఆశించి మినీ ఏటీఎం వద్దకు వెళ్లాడు. తనను సదరు కాంట్రాక్టర్ పంపాడని చెప్పడంతో మినీ ఏటీఎం నిర్వాహకుడు తనకు ఫోన్ చేసి నగదు బదిలీ చేయమన్న వ్యక్తి తన మనిషిని డబ్బులు ఇచ్చి పంపాడేమోనని భావించాడు. వచ్చిన వ్యక్తి నుంచి డబ్బులు తీసుకోకుండానే ఫోన్‌లో చెప్పిన వ్యక్తి అకౌంట్‌కు రూ.45వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. డబ్బులు పంపిన తరువాత తన ముందున్న వ్యక్తికి నగదు ఇవ్వమని అడుగగా అసలు విషయం బయట పడింది. తాను బిర్యాణి సెంటర్ నుంచి వచ్చానని, తనకే ఇక్కడ డబ్బులు ఇస్తారని ఫోన్ చేశారని తెలుపడంతో అసలు మోసం బయట పడింది.

● స్థానిక వ్యాపారుల పేర్లు, వివరాలతో మోసాలు..

సైబర్ నేరస్థులు ఇన్నాళ్లు ఫోన్ నంబర్ల ఆధారంగానే మోసాలకు పాల్పడేవారు. ఇప్పుడు మీసేవా నగదు బదిలీ కేంద్రాలు, ప్రముఖ వ్యాపార సంస్థల వివరాలు గూగుల్ మ్యాప్‌లో అందుబాటులో ఉంటాయి. దీని ఆధారంగా ఆన్‌లైన్‌లో నిర్వాహకుల పేర్లు, వ్యాపార వివరాలను సైబర్ నేరస్థులు సేకరిస్తున్నారు. వీటి ఆధారంగానే సులువుగా మోసాలకు పాల్పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం గోదావరిఖనిలోని పలువురు వ్యాపారులకు ఫోన్లు చేసి తాము మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మాట్లాడుతున్నామని, ట్రేడ్ లైసెన్స్‌ల సొమ్ము ఏకకాలంలో తాము చెప్పిన నంబర్లకు ఫోన్‌పే ద్వారా పంపాలంటూ ఒత్తిడి చేశారు. దీంతో వ్యాపారులు అప్రమత్తమయ్యారు.

● అప్రమత్తతోనే రక్షణ...

సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే మోసపోకుండా రక్షణ పొందే అవకాశం ఉంటుంది. ఏ చిన్న ఫోన్‌కాల్ విషయంలో ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

రోడ్డు పక్కన దేశ నాయకుల ఫొటోలు

- ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజలు



రోడ్డు పక్కన పడేసిన దేశనాయకుల ఫొటోలు

కొడిమ్యాల, డిసెంబరు13 (ఆంధ్ర జ్యోతి): కొడిమ్యాల నుంచి పూడూర్ వెళ్లేదారిలో రోడ్డు పక్కన శుక్రవారం దేశ నాయకుల ఫొటోలు కనిపించాయి. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్, జాతిపిత మహా త్మాగాంధీ చిత్రపటాలతో పాటు మరి కొంత మంది మహనీయుల ఫొటోలు రోడ్డు వెంట వెళ్లేవారిని ఆశ్చర్యానికి గురిచేశాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా, రాష్ట్ర నాయకులు కొత్తూరి స్వామి, అధ్యక్షుడు సురుగు శ్రీను మాట్లాడుతూ మహనీయులను అవమాన పరిచే విధంగా ఫొటోలను రోడ్డుపై పడేసిన వారిని గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు.

యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కార్యవర్గం



జిల్లా కన్వీనర్ రాజయ్య



కో కన్వీనర్ పోచమల్లు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్, కో కన్వీన ర్లను నియమిస్తూ వేదిక రాష్ట్ర అధ్య క్షుడు చలకాని వెంకట్‌యాదవ్ ప్రకట న జారీ చేశారు. జిల్లా కన్వీనర్‌గా ఆసర రాజయ్య యాదవ్, కోకన్వీన ర్‌గా పోచమల్లు యాదవ్‌ను నియ మించారు. జిల్లాలో యాదవ విద్యావం తుల వేదికను పటిష్ట పరిచే విధంగా కృషిచేయాలని సూచించారు. వీరి నియామకం పట్ల పలువురు వేదిక నా యకులు, యాదవులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రపంచ చెస్ చాంపియన్‌గా గుకేష్ గెలుపుపై సంబరాలు



సంబరాలు నిర్వహిస్తున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చదరంగ చాంపియన్‌గా నిలిచిన గుకేష్‌కు అభినందనలు తెలియజేస్తూ జిల్లా కేంద్రంలోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ స్టేడియం ఆవరణలో ఘనంగా సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ క్రీడాకారులు, నగరంలోని క్రీడాకారులు భారీ ర్యాలీ నిర్వహించి, బాణా సంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అతిథిగా పాల్గొన్న ఒలంపిక్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ చాంపియన్‌గా గుకేష్ గెలవడం భారతదేశానికి గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, పీడీ అంతటి శంకరయ్య, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, జిల్లా డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు కంకటి సృజన్‌కుమార్, తాటిపల్లి సతీష్‌బాబు, చదరంగ బాధ్యులు అరుణ్, అనూష్, గౌతమ్, అభి, వెంకటేశ్, పీఈటీలు, చదరంగ క్రీడాకారులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగిన వారికి రౌడీషీట్ల నుంచి విముక్తి

- సమీక్షకు డీసీపీ ఆధ్వర్యంలో కమిటీ
- పదేళ్ల క్రితం నమోదైన షీట్లపై పరిశీలన



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా రౌడీషీటర్ల జాబితాలో ఉండి సత్ప్రవర్తన కలిగిన వారికి షీట్ల నుంచి విముక్తి కల్పించాలని ప్రభుత్వం సూచనలు చేసింది. ఈ మేరకు రామగుండం పోలీస్ కమిషరేట్ పరిధిలో సత్ప్రవర్తన కలిగి, ఎలాంటి వివాదాలకు, నేరాలకు పాల్పడకుండా ఉన్న వారిని మానవీయ కోణంతో షీట్లపై సమీక్షించాలని పోలీస్ కమిషనర్ నిర్ణయించారు. పది సంవత్సరాల క్రితం రౌడీషీట్ నమోదై ఇప్పటి వరకు సత్ప్రవర్తన కలిగి ఉండి, ఎలాంటి నేరం చేయకుండా సాధారణ జీవితం గడిపితే వారి షీట్లు తొల గించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రస్తుత షీట్ల సమీక్షకు డీసీపీ చేతన ఆధ్వర్యంలో ఎస్‌బీ ఏసీపీ, పెద్దపల్లి, గోదావరిఖని ఏసీపీలతో ఒక కమిటీని ఏర్పా టు చేశారు. ఈ కమిటీ రౌడీషీటర్లు, కేడీ, సస్పెక్ట్ తదితర షీట్లపై సమీక్ష చేయనున్నది. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాలో పోలీస్ రికార్డుల ప్రకారం 223మంది రౌడీషీటర్లు ఉన్నారు. ఇందులో గోదావరి ఖని వన్‌టౌన్‌లో అత్యధికంగా 59మంది రౌడీషీటర్లు ఉన్నారు. టుటౌన్‌లో నలుగురు, కమాన్‌పూర్‌లో ఇద్దరు, ఎన్‌టీపీసీలో 22, రామగుండంలో 4, మంథని లో 24, రామగిరిలో 12మంది రౌడీషీటర్లు ఉన్నారు. అలాగే పెద్దపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పెద్దపల్లి ఠాణా పరిధిలో 14, ధర్మారం 26, బసంత్‌నగర్ 18, సుల్తానాబాద్ 19, పాలకుర్తి 8, కాల్వశ్రీరాంపూర్ 2, జూలపల్లిలో 9షీట్లు ఉన్నాయి. గతంలో తీవ్ర నేరాలు, హత్యలు, హత్యాయత్నాలు, బహిరంగ దాడుల కు పాల్పడడం, బెదిరింపులు, బలవంతపు వసూళ్ల తదితర కేసులను దృష్టిలో ఉంచుకుని రౌడీషీట్లు తెరిచారు. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతం లో క్రూరమైన హత్యలు, నడిరోడ్డుపై దాడులు, మూకదాడులు, హత్యాచార యత్నాలను పరిగణలోకి తీసుకుని షీట్లు తెరిచారు. గతంలో కొందరు రౌడీషీ టర్లు షీట్లు తెరిచినా కూడా తమ ప్రవర్తన మార్చుకోకుండా ఇప్పటికీ బెదిరింపులు, గొడవలకు పాల్పడడం, కేసులు నమోదు అవడం వంటివి చోటు చేసుకుంటున్నాయి. మరికొందరు షీట్లు నమోదు అయినప్పటి నుంచి నేరాలకు, గొడవలకు దూరంగా ఉంటున్నారు. కొందరు తమపై ఉన్న షీట్లను తొలగించేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. కొందరు ఏళ్ల తరబడి ఠాణాల చుట్టూ తిరుగుతు న్నారు. ఇందులో 25ఏళ్ల క్రితం రౌడీషీట్లు నమోదు అయిన వారు కూడా ఉన్నా రు. మొత్తంగా నేర ప్రవృత్తికి దీర్ఘకాలంగా దూరంగా ఉన్న రౌడీషీట్లపై రామగుండం పోలీస్ కమిషనర్ పరిశీలన చేస్తుండడంతో రౌడీషీటు ఉన్న సాధారణ జీవితం గడుపుతున్న కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

మహా శివరాత్రి వరకు సౌకర్యాలు కల్పించాలి

- జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

సారంగాపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వరకు భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుక రావాలని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సారంగాపూర్ మండలంలోని పెంబట్ల శ్రీ దుబ్బరాజేశ్వర స్వామి దేవాలయాన్ని బీఆర్‌ఎస్ నేతలతో కలిసి శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఎంపీగా కవిత గతంలో మంజూరు చేసిన రూ 86 లక్షల నిధులతో చేపట్టిన గోపురం, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ పనులు వేగవంతంగా, నాణ్యత ప్రమాణాలు పాటించి పూర్తి చేయించాలని ఆమె తెలిపారు. అలాగే బీర్‌పూర్ లక్ష్మీ నరసింహ స్వామి, జగిత్యాల గుట్ట రాజేశ్వర స్వామి, కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయాలకు కూడ నిధులు మంజూరు చేసినట్లు ఆమె గుర్తు చేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ సారంగపూర్ మండల అధ్యక్షులు తేలు రాజు, సారంగపూర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాగి సత్యంరావు, మండల యూత్ అధ్యక్షులు సిలివేరి మదన్, ఒడ్నాల జగన్, అత్తినేని నరేష్, ఆకుల తిరుపతి, ఎండబెట్ల ప్రసాద్, సాంబారి గంగాధర్, రమేష్, జలందర్, అలీం, వేణు, రవి, బండారి వెంకటేష్, సుమన్‌నాయక్, అరవింద్‌గౌడ్, రవిగౌడ్, శ్రీను, రాజరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

వర్గీకరణపై సీఎం స్పందించాలి

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు, అంబేద్కర్ సంఘ నాయకులు

కోరుట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్‌డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి కార్యాలయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో మహిళా సోదరీమణులు డప్పు కళాకారులు సిందు మాదిగల ఆధ్వర్యంలో పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా పలు పార్టీలు కమీషన్లు, కమిటీలు వేస్తూ వస్తున్నారని ఇప్పటి వరకు ఏ ఒక్క నాయకుడు గానీ పూర్తిస్థాయిలో వర్గీకరణ చేపట్టలేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో భారతదేశంలోనే మొట్ట మొదటిసారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఏకగ్రీవంగా తీర్మానం చేసి వర్గీకరణ చేస్తామని వాగ్దానం చేసారని అన్నారు. ఇప్పుడు ఒక కమిటీ వేశారని కమిటీ కాలయాపన కోసం పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, ఎంఆర్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి వనతపుల అంజయ్య, నాయకులు రాజశేఖర్, నారాయణ, ఎర్ర శంకర్, బలవంతుల సురేష్, పేట భాస్కర్, రాజేష్, సీహెచ్ లక్ష్మణ్, శని గారపు వినోద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజా మహోత్సవం



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

కోరుట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తిలక్‌రోడ్డులో అయ్యప్ప పడిపూజ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. వేదపండితుడు పాలెపు రామకృష్ణ మంత్రోచ్చారణల మధ్య పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. కాలనీకి చెందిన రుద్ర వసంత్ కుమార్ కన్నె స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వాముల ఉత్సవ మూర్తులకు అభిషేక కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక పూజలను జరిపారు. వేంకటేశ్వర భజన మండలి గురుస్వామి గట్ట అనంద్ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలను నిర్వహిచారు. రుద్ర వసంత్ కుమార్ స్వాములకు అన్న ప్రసాదం అందించగా బారీగా స్వాములు పాల్గొన్ని అన్న ప్రసాదాన్ని స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు అంబల్ల శ్రీనివాస్, జుంబర్తి రమేష్, ప్రశాంత్, సాయి, తోట రాజు, గడ్డం మధులతో పాటు పలువురు పాల్గొన్నారు.

మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడి అరెస్టు

జమ్మికుంట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ యువకుడు శుక్రవారం రాత్రి మహిళలతో అసభ్యంగా ప్రవర్తించాడు. మంచిర్యాలకు చెందిన భోగి అఖిల్ తన బాబాయ్ కుమార్తె ఎంగేజ్‌మెంట్ కోసం జమ్మికుంటకు వచ్చాడు. ఒంటిపై దుస్తులు లేకుండా జమ్మికుంట బస్టాండ్ వద్ద యువతులు, మహిళల వద్దకు వచ్చి వీరంగం సృష్టించాడు. యువకుడి ఆగడాలతో విసుగు చెందిన ప్రయాణికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు యువకుడిని స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

● ఆన్‌లైన్ క్లిక్..

పనులు ఎప్పటికి పూర్తయ్యేను...?

నగరం నుంచి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా చొప్పదండి రోడ్డులో తీగలగుట్టపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభమై ఏడాది దాటినా ముందుకు సాగడం లేదు. ఓవైపు పిల్లర్లు వేసి వదిలేయగా మాణికేశ్వరి గుడివైపు స్లాబ్ దశలో నిలిచిపోయి ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. రైలు గేటు పడటంతో పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్డుపై నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కరీంనగర్



తీగలగుట్టపల్లి వద్ద పిల్లర్ల దశలో నిలిచిపోయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి



రైలు గేటు పడడంతో ప్రయాణికుల ఇక్కట్లు



తీగలగుట్టపల్లివైపు ఓవర్ బ్రిడ్జి స్లాబ్ దశలో నిలిచిపోయిన పనులు

16 నుంచి ధనుర్మాసోత్సవాలు



ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి

ధర్మపురి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఆలయాలు ఉదయం 3 గంటలకు తెరచి ఉంచుతారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఉదయం 4 గంటల నుంచి 5-30 వరకు స్వామి వారికి నిత్యం అర్చకులు ప్రత్యేక అభిషేకం, స్వామి వారికి తిరుప్పావై ప్రబంధం జరుపుతారని తెలిపారు. అనంతరం స్వామి వారికి నైవేద్యం సమర్పిస్తారని పేర్కొన్నారు.

నేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఖని క్రీడాకారుడికి చోటు



సంతోష్ ట్రోఫీ జట్టుకు ఎంపికైన క్రీడాకారుడు అభిషేక్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ నుంచి గోదావరిఖనికి చెందిన అభిషేక్‌కు జట్టులో చోటు లభించింది. గత ఏప్రిల్‌లో గోదావరిఖనిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో కరీంనగర్ జట్టు 3వ స్థానంలో నిలువగా సీనియర్ నేషనల్ టీమ్ సెలక్షన్‌లో సంతోష్ ట్రోఫీ కోసం నిర్వహించిన ఎంపిక జట్టులో అభిషేక్ తెలంగాణ జట్టు నుంచి ఆడనున్నాడు. ఎంపికైన అభిషేక్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ గణపతి అభినందించారు.

ఎస్‌యూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

గణేశ్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమైనట్లు శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఉదయం మొత్తం 12,220 విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 11,205 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు.

'కళ' తప్పిన చిందు యక్షగానం



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు (ఫైల్)



ప్రదర్శనలో వేషధారణ (ఫైల్)

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వీనుల విందైన సంగీతాన్ని అందించిన వారి హార్మోనియం నేడు మూగబోతోంది.. విశేష ఆదరణ పొందిన చిందు యక్షగానం కళతప్పింది. పాశ్చాత్య సంస్కృతి చిందు యక్షగాన కళను కబళిస్తోంది. చిందు యక్ష కళాకారుల ప్రదర్శన ఉందంటే ఊళ్లోని చిన్నా, పెద్దలు భారీ సంఖ్యలో తరలివచ్చేవారు. రామరావణ, శ్రీకృష్ణార్జున యుద్ధం, అల్లీరాణి, చెంచులక్ష్మి, భక్తప్రహ్లాద, సత్యహరిశ్చంద్ర, గుణసుందరికథ, చిరుతల రామాయణం తదితర నాటకాలను రాత్రంతా ఆసక్తిగా చూసేవాళ్లు. ఊళ్లో నాటకం ఉందంటే చుట్టు పక్కల గ్రామాల వారు ఎడ్లబండ్లపై ఉత్సాహంగా తరలివచ్చిన రోజులు ఉన్నాయి. ఆనాడు కళాకారులకు గ్రామస్తులు, గ్రామ పెద్దలు, కుల సంఘాల ఆధ్వర్యంలో కళాకారులకు డబ్బులు, ధాన్యంతోపాటు వస్త్రాలు, కానుకలు ఇచ్చి సత్కరించేవారు. టీవీలు, సినిమాలు రాకతో చిందు యక్షగానకళలతో పాటు వీధి బాగోతాలు, బుర్రకథ, హరికథలు అంతరించే దశలో ఉన్నాయి. ఆదరణ కరువై కళాకారులకు ప్రదర్శనలు లేక జీవనోపాధి కరువైంది. దీంతో కుటుంబ పోషణ కోసం కొందరు కళాకారులు కూలీలుగా మారారు. ఆదరణ లేక ఈ కళను నేర్చుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో చిందు యక్షగానం ప్రాభవం కోల్పోతున్నది.

● చిందు యక్షగానం.

చిందు యక్షగానాన్ని సుమారు 12మంది సభ్యులు రక్తి కట్టిస్తారు. హార్మోనియం, తబలా, తాళాలు ప్రధాన వాయిద్యాలు. ఏ నాటకం వేసినా ఒకరు విలన్, ఒకరు హీరో, ఒకరిద్దరు ఆడవేషాలు, ఒక బుడ్డరఖాన్, సహాయకులు ఒకరిద్దరు, మిగతా వారందరూ వాయిద్య సహకారం, కోరస్ అందిస్తారు. నాటకాన్ని మూడు నుంచి ఐదు రోజుల వరకు వేసేవారు. ఊరందరూ కలిసి వీరిని ప్రతి సంవత్సరం పిలిపించుకొని శుభకార్యాల్లో నాటకాలు వేయించేవారు. భోజనం, విడిది ఏర్పాటు చేసేవారు.

● వారి కోరికలివే...

నెలనెలా ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కళాకారులను ఆర్థికపరంగా ఆదుకోవాలని, చిందుయక్షగాన యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని, సంఘ భవనాన్ని నిర్మించి, పింఛన్ ప్రతినెలా అందేలా చూడాలని ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● కరవైన ఉపాధి

చిందు యక్షగాన కళ ప్రదర్శనలు లేక నిరాదరణకు గురవుతున్నది. ప్రదర్శనలు లేకపోవడంతో కళాకారులకు పూట గడవడం కష్టంగా మారింది. అప్పుడప్పుడు ఎవరైనా ప్రదర్శనకు పిలిస్తే వెళ్లి కళకు జీవం పోస్తున్నారు. గతంలో ప్రభుత్వాలు అక్షరాస్యత నిర్మూలన, కుటుంబ నియంత్రణ, సంపూర్ణ పారిశుధ్యం, జన్మభూమి తదితర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమాల ద్వారా కళాకారులకు ఉపాధి కల్పించింది. ఆ తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోక నానాటికీ వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయి.

● తీగలగుట్టపల్లిలో వంద కుటుంబాలు

కరీంనగర్ మండలం తీగలగుట్టపల్లి గ్రామంలో దాదాపు వంద కుటుంబాలకు పైగా చిందు కుటుంబాలు ఉన్నాయి. గతంలో నాటక ప్రదర్శనతో ఉపాధి పొందిన కళాకారులు ప్రస్తుతం పూట గడవని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఒక వైపు ప్రదర్శనలు లేకపోవడం, మరో వైపు ప్రభుత్వ పథకాల ప్రచారంలో అవ కాశం కల్పించకపోవడంతో కళాకారులు ఇతర వృత్తులను ఆశ్రయించారు. యువకులు ఈ వృత్తిని విడిచి ఉపాధినిచ్చే వృత్తుల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం ఈ గ్రామంలో పదుల సంఖ్యలో మాత్రమే వృద్ధ కళాకారులున్నారు. నలుగురికి తప్ప కొందరికి వృద్ధకళాకారులకిచ్చే పింఛన్ సైతం మంజూరు కాకపోవడంతో ఆర్థికం గా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలువురికి నివాస గృహాలు కూడా లేకపోవడంతో పూరి గుడిసెల్లో జీవితం గడుపుతున్నారు.



2003లో శాతవాహన కళోత్సవాల్లో పాల్గొన్న కళాకారులు (ఫైల్)

● ప్రభుత్వం ఆదుకోవాలి



ఒకప్పుడు యక్షగాన ప్రదర్శనల ద్వారా కుటుంబంలోని అందరికి ఉపాధి దొరికేది. కళాకారులకు, కళకు గౌరవముండేది. ఇప్పుడు ఆదరణ లేకపోవడంతో ఉపాధి కరువయింది. ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమాల్లో సైతం అవకాశమివ్వకపోవడంతో ఉపాధిలేక రోడ్డున పడ్డాం. ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తగిన చర్యలు చేపట్టాలి.

- గజవెల్లి కిష్టయ్య, చిందు యువజన యక్షగాన కళాకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు

● ఆసరాగా నిలవాలి



కళాకారులకు తగిన ప్రాధాన్యం కల్పించి ప్రదర్శనలకు అవకాశం కల్పించి ఆదుకోవాలి. కళాకారులకు పింఛన్ అందజేసి ఆసరాగా నిలవాలి. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి.

- గడ్డం అంతయ్య, కళాకారుడు

పశుగ్రాసానికి డిమాండ్

- గడ్డి కట్ట ధర రూ. 80
- మెట్ట ప్రాంతానికి తరలిస్తున్న పశుపోషకులు



దమ్మక్కపేటలో పశుగ్రాసాన్ని తీసుకెళ్తున్న రైతులు

హుజూరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతంలో పశుగ్రాసానికి భలే డిమాండ్ ఉంది. గత ఏడాది యాసంగిలో వరి పంటలు నీళ్ల లేక ఎండిపోయాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగానే రైతులు పశుగ్రాసాన్ని నిల్వ చేసుకుంటున్నారు. వరి కోతలు దాదాపుగా పూర్తయ్యాయి. రైతులు తమ పశువుల మేత కోసం గడ్డిని సేకరిస్తున్నారు. కొంత మంది రైతులు గడ్డిని రోలర్ తెప్పించుకొని గడ్డి కట్టలు చుట్టించుకుంటున్నారు. ఒక వరిగడ్డి కట్టకు మెట్ట ప్రాంత రైతులు రూ. 80 చెల్లిస్తున్నారు. మెట్ట ప్రాంతమైన సైదాపూర్, హుస్నాబాద్, భీమదేవరపల్లి, కోహెడ, ఎల్కతుర్తి, జనగామ, స్టేషన్ ఘనపూర్ తదితర ప్రాంతాలకు లారీలు, ట్రాక్టర్లలో తీసుకెళ్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రతి ఇంటికి పాడి పశువులు ఉండడంతో ఈ పశుగ్రాసాన్ని సేకరిస్తున్నారు. వేసవిలో పశుగ్రాసం కొరత ఉంటుందనే భయంతోనే ముందుగానే రైతులు జాగ్రత్త పడుతున్నారు. ప్రస్తుతం రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు ఆసక్తి కనబరుస్తుండడంతో పశువుల పేడకు డిమాండ్ ఉంది. దీంతో పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారు. పశువుల పేడకు ట్రాక్టర్‌కు రూ. 3వేల ధర పలుకుతుండడంతో రైతులకు ప్రయోజనంగా ఉందని చెబుతున్నారు.



సైదాపూర్ మండలం బొమ్మకల్‌లో నిల్వ చేసిన గడ్డి కట్టలు

పరిశోధనలతోనే విప్లవాత్మక మార్పులు

- రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలి - జయశంకర్ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాల్లో వక్తలు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తల పరిశోధనల ఫలాల వల్లనే వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, క్షేత్రస్థాయి రైతులకు ఇవి అందినప్పుడే సంపూర్ణ అభివృద్ధి సాధ్యం అవుతుందని వక్తలు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పడి 60ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా పరిశోధన స్థానంలో ముందస్తు వజ్రోత్సవాలు ఏడీఆర్ గాదె శ్రీనివాస్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, అతిథులుగా ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో పాటు శాస్త్రవేత్తలు, విద్యార్థులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు సావనీర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ పొలాస వ్యవసాయ పరిశోధన స్థానానికి రాష్ట్రంలో ప్రత్యేక స్థానం ఉందని, దాని కొనసాగింపునకు మరింతగా కృషిచేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటల సాగు విధానం వైపు వెళ్లకుండా, వాణిజ్య లాభాదాయ పంటల వైపు దృష్టిని మరల్చి అధిక లాభాలు పొందాలని సూచించారు. హైదరాబాద్ శంషాబాద్ వద్ద హైడ్రోఫోలిఫ్ విధానంతో సుమారు వెయ్యి ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారని, ఆ విధా నం మన వద్ద కూడా అవలంబిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంగా కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వజ్రోత్స వాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఈ సందర్భగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

- ఆకట్టుకున్న స్టాల్స్..

యూనివర్సిటీ వజ్రోత్సవాల వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ రైతులను, అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రైతులకు అవసరమైన పరికరాలు, పనిముట్లు, వంగడాలను ఈ స్టాల్స్‌లో ప్రదర్శించారు. విత్తన ప్రదర్శన కార్యక్ర మంలో భాగంగా తెలంగాణ ప్రాంతంతో పాటు జిల్లాలో సాగు చేస్తున్న వివిధ వంగడాలతోపాటు, చెరుకు, మొక్కజొన్న, సోయ వంటి ఉత్పత్తులను, వాటి దిగుబడులను అతిథులకు విద్యార్థు లు, శాస్త్రవేత్తలు వివరించారు.

విద్యావంతులకు సాగుపై ఆసక్తి..

- వెల్ముల రాంరెడ్డి, రైతు, పూడూర్



కొందరు విద్యావంతులు సాగుకు ఆసక్తి చూపుతూ, నూతన విధానాలతో రాణిస్తుండడం అభినందనీయం. జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ఈ యేడాది వజ్రోత్సవాలు నిర్వహించుకోవడం శుభ పరిణామం. 60ఏళ్లలో వ్యవసాయ రంగంలో అభివృద్ధి జరిగిన మాట వాస్తవమే. కొత్త వంగడాలు, యాంత్రీకరణ జరిగింది. కానీ ప్రస్తుత వ్యవసాయంతో బతుకుదెరువు ఉందనే భరోసా లేకుండా పోతోంది. రైతు వారసులు అంతగా వ్యవసాయం వైపు ఆసక్తి చూపడం లేదు.

మార్కెటింగ్ విధానంపై పరిశోధనలు జరగాలి..

- పులి లక్ష్మీపతి, రైతు, బోయినిపెల్లి



వ్యవసాయ పరిశోధన స్థానంతో దశాబ్దాల అనుబంధం ఉంది. ప్రస్తుత యేడాది యూనివర్సిటీ వజ్రోత్సవాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉంది. కానీ నూతన వరి వంగడాలు కనుగొనడం, వాటి ఫలాలను రైతుల చెంతకు చేర్చడంలో జాప్యం జరుగుతున్నది. జాప్యాన్ని నిలువరించే చర్యలు తీసుకోవాలి. ఆంధ్రా వంగడాల మాదిరిగా, తెలంగాణ వంగడాలు పోటీని అధిగమించలేకపోతున్నాయి. రైతు ఆలోచనలు, ఆకాంక్షలతో పాటు వారి అభివృద్ధికి అను గుణంగా పరి శోధనలు జరగాలి. భవిష్యత్తులో పీజేటీఏయూ చర్యలు తీసుకునేందుకు ముందుకు సాగుతుందని ఆశిస్తున్నాం.

వైద్య సేవలపై తనిఖీ బృందం పరిశీలన



సభ్యులకు స్వాగతం పలుకుతున్న వైద్య సిబ్బంది

వీణవంక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామంలోని పీహెచ్‌సీలో అందుతున్న సేవలను పరిశీలించేందుకు శుక్రవారం జాతీయ నాణ్యత పరిశీలన అధికారులు వచ్చారు. ఈ మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, మెడికల్ ఆఫీసర్ వరుణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, ప్రసవాల సంఖ్యను అడిగి తెలుసుకొని వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో జాతీయ నాణ్యత తనిఖీ బృందం సభ్యులు డాక్టర్ శరమ భాను, డాక్టర్ శర్మ, భరత్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ వరుణ, ఎంసీహెచ్ సన జవీరా తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

త్యాగరాజ ఉత్సవాలకు దరఖాస్తుల ఆహ్వానం

వేములవాడ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో 18 జనవరి 2025 నుంచి 22 జనవరి వరకు నిర్వహించనున్న త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలకు కళాకారులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఉత్సవాల్లో సుప్రసిద్ధ కళాకారుల శాస్త్రీయ, సంగీత, జంత్రవాద్య సోలో, హరికథ, నృత్య, నాటక, ఉపన్యాస, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్పపూల దేవేందర్, టీటీయూ జిల్లా అధ్యక్షుడు కొండి కోప్పుల రవి, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ డిమాం డ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కమి టీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. కేజీబీవీ పాఠశాలలకు చెందిన ఎస్‌వోలు, యూ ఆర్‌ఎస్ ఎస్‌వోలు, ఉద్యోగులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలి పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సంఘాలకు చెందిన పలువురు మద్దతు తెలిపారు. దీక్షల్లో బుర్ర జలేందర్, జయలక్ష్మి, నీరజ, వెంకట రమణ, పద్మ, నరేందర్, శ్రీనివాస్, దేవరాజ్, సలీం, వెంకటేష్, శ్యామల పాల్గొన్నారు.



పెద్దపల్లిలో బతుకమ్మ ఆడుతూ నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకశిలా పార్కు వద్ద ఇచ్చిన హామీని అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న సమ్మె శుక్రవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. పెద్దపెల్లి దీక్ష శిబిరాన్ని ఉపాధ్యాయ సంఘ నాయకులు. టీటీయూ ప్రెసిడెంట్ రవి కుమార్ జనరల్ సెక్రెటరీ మానసూర్ సీపీఐ జిల్లా సీక్రెట్ తాండ్రా సదానందం ఏఐఎస్ఎఫ్ ప్రెసిడెంట్ మనస కుమార్ మద్దతు ప్రకటించారు శుక్రవారం రోజున మహిళా ఉద్యోగులు బతుకమ్మలు పేర్చి రోడ్డుపై పెట్టి ఆడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు తిప్పని తిరుపతి. కేజీబీవీ రాష్ట్ర నాయకురాలు పుల్లూరి సంధ్యారాణి. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారు కుంబాల సుధాకర్, రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి మల్లన్న, రామగిరి రవిరాజు, కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారులు స్వప్న, విజయలక్ష్మి, కమల, జ్యోతి, స్వప్న, జిల్లా నాయకులు పిల్లి రమేశ్, ఆర్ కృష్ణయ్య, సీఆర్పీలు, పీజీ సీర్పీలు, కోఆర్డినేటర్లు. సీసీవోలు, మెసెంజర్లు 250మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం



ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): లగిచర్ల రైతులకు బేడీలు వేసినందుకు నిరసనగా కమాన్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అల్లుడి ఫార్మా కంపెనీని సొంత భూముల్లో ఏర్పా టు చేసుకోకుండా దళిత నిరుపేద గిరిజన రైతుల భూములు లాక్కోవడం ఎందుకో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో దుబాల శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, గుంజేటి శివకుమార్, అవుదుర్తి శ్రీనివాస్, పురం హరిశంకర్, తణుకు సాయికృష్ణ, కలికోట మోహన్, మాచర్ల కోటేష్, పోరెడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి వృద్ధుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైమ్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు అపార్ట్‌మెంట్ భనవంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కట్టరాంపూర్‌కు చెందిన కుంకుమల్ల శ్రీరాములు(78) తనకుటుంబంతో ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ పలుమార్లు చనిపోతానని కుటుంబసభ్యులతో అంటుండేవాడు. శుక్రవారం ఐదో అంతస్తుకు వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకాడు. తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కరీంనగర్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో రవీందర్ అన్నారు. కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులందరూ యూనిఫామ్స్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కలెక్టర్ ఉచితంగా సరఫరా చేసిన షూస్, సాక్స్‌లను విద్యార్థులు ప్రతి నిత్యం వేసుకోవాలని తెలిపారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి రోజు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తామన్నారు. మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయులందరూ చక్కటి వాతావరణంలో బోధన జరిగేలా చూడాలన్నారు. సైన్స్ టాలెంట్‌టెస్ట్‌కు సహకరించినందుకు ఉపాధ్యాయులను, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న ఎంఈవో రవీందర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఒకటో ఠాణా సమీపంలోని సగం వరకు కూల్చివేసిన ఒక భవనంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చ్యూరీ గదిలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు వెంటనే సీఐ ఫోన్ 8712670761 నంబర్‌కు లేదా ఒకటో ఠాణా ఫోన్ 8331940591కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

సీఐకి ప్రశంసాపత్రం అందజేత

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం ఒక మహిళ 10 తులాల బంగారు ఆభరణాల బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోగా గంటల వ్యవధిలో వెతికి పట్టుకుని అప్పగించిన సీఐ బిల్ల కోటేశ్వర్‌కు శుక్రవారం పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ప్రశంసాపత్రం అందించి అభినందించారు. సీఐతో పాటు సిబ్బంది కుమార్, సంపత్‌లను కమిషనరేట్ కేంద్రంలో సీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ జి నరేందర్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్‌లో శుక్రవారం సుబ్రహ్మణ్య స్వామి వారలకు ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో అర్చకులు విశేష అభిషేకం, ఫల పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్యక్రమల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్ పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

కరీంనగర్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్-లలిత పెళ్ళిరోజును పురస్కరించుకుని లయన్స్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో బొమ్మకల్‌లోని ఇటుక బట్టీల వద్ద శుక్రవారం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ లయన్ చింతల కిషన్ పటేల్, క్లబ్ అధ్యక్షుడు కాంరెడ్డి నరసింహారెడ్డి, సెక్రెటరీ లయన్ బట్టు రాజేందర్ పాల్గొన్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

-కరీంనగర్ మండలంలో 1.49 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ

కరీంనగర్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. మండలంలో మొత్తం 1.49 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. మండలంలో 12,990 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో దొడ్డు రకం 10,700ఎకరాలు సాగు చేయగా 2,250 ఎకరాల్లో సన్నరకం వరి పంటను సాగు చేశారు. మండలంలో మొత్తం మొత్తం20 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరించారు. కరీంనగర్ సహకార సంఘం ఆధ్వర్యంలో 11 కేంద్రాలను, దుర్శేడ్ సహకార సంఘం ఆధ్వర్యంలో 6, ఐకేపీ ఆధ్వర్యంలో 3 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుల నుంచి కొనుగోళ్ళు చేశామని కరీంనగర్ వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, దుర్శేడ్ సహకార సంఘం అధ్యక్షుడు తోట తిరుపతి, ఐకేపీ ఏపీఎం భార్గవ్‌లు తెలిపారు.

'అభివృద్ధిని పట్టించుకోని బీజేపీ, బీఆర్ఎస్'

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అభివృద్ధిని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు గత 10 ఏళ్ళుగా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహ్మద్ అమీర్‌లు విమర్శించారు. డీసీసీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటిని ఒక్కోటి అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే 6 గ్యారంటీలు అమలుచేస్తున్న ప్రభుత్వంకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు మద్దతు లెలుపుతుంటే ఓర్వలేకనే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కరీంనగర్ అభివృద్ధికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ఒక్క రూపాయి తీసుకు రాలేదని, బీఆర్ఎస్ హయాంలో కరీంనగర్ స్మార్ట్ సిటీ పనులలో అక్రమాలకు పాల్పడి ప్రజాధనం లూటీ చేశారని అన్నారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారం మానుకుని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కలిసి రావాలన్నారు.

అపోలో రీచ్‌లో అరుదైన ఆపరేషన్

సుభాష్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అపోలో రీచ్ హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్ నిర్వహించినట్లు ఆసుపత్రి కార్డియాసర్జన్ డాక్టర్ సంతోష్ కుమార్, అనిస్థిషియా వైద్య నిపుణులు డాక్టర్ దామోదర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని అపోలో రీచ్ ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో వారు వివరాలు తెలియజేశారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రంగపేటకు చెందిన 84 ఏళ్ల భూమక్కకు విజయవంతంగా బైపాస్ సర్జరీ నిర్వహించినట్లు తెలిపారు. 80 సంవత్సరాలు దాటిన వయస్సు వారికీ బైపాస్ సర్జరీ రిస్క్‌గా మారుతుందని, వారికి వెంటిలేటర్ అవసరంతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఈ సర్జరీ ఉచితంగా నిర్వహించామన్నారు. దేశవ్యాప్తంగా అతికొద్ది మంది మాత్రమే నిర్వహించగలిగిన మిక్స్ టెక్నిక్ ద్వారా సీఏబీజీ కరీంనగర్ లాంటి రెండవ తరగతి పట్టణాలలో కూడా అపోలో తీసుకువచ్చిందని తెలిపారు.

బాక్సింగ్‌లో అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ

భగత్‌నగర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ యూనివర్సిటీ స్థాయి బాక్సింగ్ పోటీలకు నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి ఎం కేజియా హేమిమా ఎంపికయ్యారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుంచి పంజాబ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మానేరు విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్‌లో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషుల, మహిళల బేస్‌బాల్ పోటీలకు కరీంనగర్ మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విశేష ప్రతిభచాటిన అక్షయ్ కార్తీక్, విష్ణువర్ధన్, ప్రణయ్ కుమార్, నిశాంత్ రెడ్డిలు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. శుక్రవారం విద్యార్థులను మానేరు అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు.

గురుకుల కళాశాలకు ఇంగ్లీష్ నోట్స్ వితరణ

కరీంనగర్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు సీనియర్ ఆంగ్ల అధ్యాపకులు, హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ శుక్రవారం ఉచితంగా ఇంగ్లీష్ నోట్స్ వితరణ చేశారు. విద్యార్థులు నోట్స్ పొందుటకు 8885549467 నంబర్‌కు వాట్సప్ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.మాలతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సమత పాల్గొన్నారు.

గణిత పోటీలను విజయవంతం చేయాలి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్ బ్లూబెల్స్ పాఠశాలలో ఈనెల 15న నిర్వహించనున్న జిల్లాస్థాయి గణితశాస్త్ర ప్రతిభా పాటవ పోటీలను విజయవంతం చేయాలని టీఎంఎఫ్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు జంగ మోహర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ గణిత దినోత్సవం సంబరాల్లో భాగంగా ఈ నెల 10న మండల స్థాయిలో నిర్వహించిన గణిత ప్రతిభ పోటీల్లో ప్రతిభచాటిన 8 విద్యార్థుల ఈ పోటీల్లో పాల్గొనుటకు అర్హులని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 9:30 నుంచి 11:30 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, టు, రూరల్, ఏడీఈలు పంజాల శ్రీనివాస్‌గౌడ్, లావణ్య, గాదం రఘు లు తెలిపారు. పద్మనగర్, రాంనగర్, మంకమ్మతోట, సంతోష్ నగర్, వినాయకనగర్, కుర్మవాడ, శ్రీహరినగర్, పీటీసీ, మార్కండేయనగర్, ప్రగతినగర్, రాజీవ్‌పార్క్ పాత లేబర్ అడ్డా ప్రాంతం, సిద్దార్థ పాఠశాల, వాసర ఆసుపత్రి, పారమిత పద్మనగర్ పాఠశాల ప్రాంతం, సాయిబాబా ఆలయం, లారెల్ పాఠశాల చింతకుంట ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● ఉజ్వల పార్క్ ఏరియా, కట్టరాంపూర్, జయశంకర్ కాలనీ, వినాయకనగర్, తిరుమలనగర్, అల్కాపురి, కోతిరాంపూర్, మెయిన్ రోడ్, కోతిరాంపూర్, మెయిన్ రోడ్. గణేష్‌నగర్, గణేష్‌నగర్ బైపాస్, కమాన్ రోడ్ ఏరియాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● కొత్తపల్లి, రేకుర్తి, బొమ్మకల్, ముగ్దుంపూర్, నగునూర్ గ్రామాల్లో ఉదయం 9.30గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

● హుజూరాబాద్: హుజూరాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు టౌన్ ఏఈ శ్రీనివాగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

● వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపేట, వీణవంక సబ్‌స్టేషన్‌లలో శనివారం మధ్యాహ్నం 12గంటల నుంచి 1.30గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీణవంక, రెడ్డిపల్లి, కనగర్తి, శ్రీరాములపేట, నర్సింగాపూర్, లస్మక్కపల్లి, పోతిరెడ్డిపల్లి, కొండపాక, హిమ్మత్‌నగర్, గోవిందాపూర్, విలాసాగర్ గ్రామాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు అందరూ సహకరించాలి



సీఐ కరీంకు ట్రాఫిక్ బారికేడ్లను అందజేస్తున్న మెడికవర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రాఫిక్ సీఐ కరీం అన్నారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో తయారు చేయించిన 50 ట్రాఫిక్ బారికేడ్లను శుక్రవారం ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈసందర్భంగా సీఐ కరీం మెడికవర్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి మార్కెటింగ్ హెడ్ కోట కరుణాకర్, అబ్దుల్ వకీల్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడోత్సవాలు

భగత్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ 2024 కొత్తపల్లి మండల స్థాయి క్రీడోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో నిర్వహిస్తున్న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల సెలెక్షన్స్ నిర్వహించారు. గెలుపొందిన జట్లకు శుక్రవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎంఈవో అబ్దుల్ అజీం, అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ గిన్న లక్ష్మణ్, ఎల్ వెంకటరమణ, బి శ్రీనివాస్, ఎ శ్రీనివాస్, ఈ హరీష్, ఎస్ సందీప్ సింగ్, రవి, ఇంద్రజిత్‌సింగ్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు మహాశక్తి ఆలయంలో పడిపూజ

-పాల్గొననున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చైతన్యపురి మహాశక్తి దేవాలయంలో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి కావేటి పరమేశ్వర్ గురుస్వామిచే మహాపడిపూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ హాజరౌతారని తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కరీంనగర్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, మెడికల్ ఆఫీసర్ లావణ్యలు సూచించారు. శుక్రవారం కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాజమణి ఏఎన్ఎం స్వర్ణలత పాల్గొన్నారు.

ట్రినిటి రామానుజన్ ఒలింపియాడ్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోండి

- ట్రినిటి విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ట్రినిటి విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రామానుజన్ ఒలింపియాడ్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకొని నగదు బహుమతులను, ఫీజు రాయితీలను పొందాలని ట్రినిటి విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ట్రినిటి కళాశాలలో ఒలింపియాడ్ టెస్ట్ 2024 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు డిసెంబరు 18 వరకు లెవల్-1 పరీక్షను వారి వారి స్కూల్స్‌లో నిర్వహిస్తామన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డిసెంబరు 22న రామానుజన్ జయంతి సందర్భంగా కరీంనగర్‌లోని ట్రినిటి ప్రైమ్ క్యాంపస్, ఏసీ బాయ్స్ క్యాంపస్, ఏసీ గర్ల్స్ క్యాంపస్‌లలో లెవల్-2 పరీక్ష నిర్వహిస్తామన్నారు.

లెవల్-2లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డిసెంబరు 25న ట్రినిటి ప్రైమ్ క్యాంపస్‌లో బహుమతులను ప్రదానం చేస్తామని ప్రకటించారు. మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండో బహుమతిగా 7,500, మూడో బహుమతిగా 5,000, నాలుగో బహుమతిగా 3,000, ఐదో బహుమతిగా 2,000 రూపాయలు, 6 నుంచి 10వ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 1500 రూపాయలు, 20 మంది విద్యార్థులకు వేయి రూపాయల చొప్పున బహుమతి ప్రదానం, ప్రశంసా పత్రం అందిస్తామని అన్నారు. దీనితోపాటు లెవల్-2 పరీక్షల్లో 80శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాలలో 10శాతం నుంచి 100 శాతం వరకు ఫీజు రాయితీలు ఇస్తామని కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రినిటి వ్యవస్థాపక చైర్మన్ మనోహర్‌రెడ్డి

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి

హుజూరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన నిరుపేదలకు ప్రభు త్వం కేటాయించాలని జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు కోరారు. హుజూరాబాద్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించినప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా పంపిణీ చేయలేకపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిరుపేదలకు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిరణ్, వెంకన్న, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ పరిసరాల తనిఖీ

హుజూరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను ఈడీ కుష్రూత్ ఖాన్ శుక్రవారం తనిఖీ చేశారు.. ఈ సందర్భంగా బస్టాండ్‌లో పారిశుధ్యం పనులు, ప్రయాణికుల మంచినీటి సౌకర్యాల గురించి ఆర్టీసీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఈడీ కుష్రూత్‌ఖాన్

మరుగు దొడ్లను శుభ్రంగా ఉంచాలని బస్టాండ్ మేనేజర్‌కు ఆదేశించారు. అనంతరం బ స్టాండ్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు బస్టాండ్‌లో ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆర్టీసీ సిబ్బంది చూసుకోవాలన్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణం గా బస్సు లను నడపాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ లా ఆఫీసర్ రజినీకృష్ణ, బస్టాండ్ ఇన్‌చార్జీ ఎంవీరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్



అధికారులకు సూచనలు చేస్తున్న ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్

హుజూరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లోని ప్రధాన మురుగు కాలువను శుక్రవారం ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్ పరిశీలించారు. రెండు రోజుల క్రితం మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజ ల్లుతున్నదని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్ మురుగునీరు నిలిచిన ప్రాంతానికి వెళ్లి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ కనకయ్యలకు పలు సూచనలు చేశారు. మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

- అందుబాటులో అంబులెన్స్ సేవలు

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంజూరైనా అంబులెన్స్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిమ్మాపూర్ మండల ప్రజలకు 108 అంబులెన్స్ సేవలు చేరువయ్యాయని అన్నారు. పేద ప్రజలకు వైద్యం అందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా 250 నూతన అంబులెన్స్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, వైద్యులు అరుణ, కిరణ్, సాహితి, కాంగ్రెస్ నాయకులు ఎస్ఎల్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, పోలు రాము పాల్గొన్నారు.

● తిమ్మాపూర్: మానకొండూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కల్యాణలక్ష్మి, షాదీము బారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.

● శంకరపట్నం: ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శక్రవారం శంకరపట్నం రైతు వేదికలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లి భారం కాకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ద్వారా ఆర్థికంగా చేయూతనిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

గంగాధర, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మహిళలు పోషకాహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక అన్నారు. గంగాధర మండలం ఇస్లాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మహిళలకు ఆరోగ్యంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రేణుక ఆమె మాట్లాడుతూ గర్భిణులు తీసుకునే ఆహారంతోనే మంచి ఆరోగ్యంతో పిల్లలు జన్మిస్తారన్నారు. పిల్లలు తక్కువ బరువు ఉన్నట్లైతే ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కను కయ్య, ఏఎన్ఎం సావిత్రి, అంగన్‌వాడీ టీచర్ భారతి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

శంకరపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల విద్యాధికారి లక్ష్మీనారాయణ, హెచ్ఎం కంకణాల నీరజ ఆవిష్కరించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల పేరుమీద క్యాలెండర్ ఆవిష్కరించడం అభినందనీయమని కొనియాడారు.. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి జక్కని సంజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి పాటుపడాలి

గంగాధర, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఎండీహెచ్ డబ్ల్యూఎస్ సంస్థ ప్రతినిధులు గంగాధర మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారంతో సం స్థకు 12,589 రూపాయలను అనాథ, దివ్యాంగ పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ అనంతరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నర్సింగరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా..ప్రయాణం ఎలా..?

- ఏడాదిలోనే లేచిపోయిన తారు - రాకపోకలకు వాహనదారుల అవస్థలు

మానకొండూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ నుంచి జమ్మికుంట డబుల్ రోడ్డుపై తారు లేచిపోవడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. డబుల్ రోడ్డు పనుల్లో భాగంగా మండలంలోని అన్నారం గ్రామంలో ఏడాది క్రితం తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. అన్నారంలోని గుట్టల సమీపంలోని కల్వర్టు వద్ద వేసిన తారు రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టకపోవడంతో పూర్తిగా లేచిపోయింది. ఈ రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. తారు లేచిపోయిన ప్రదేశంలో కంకర తేలడంతో వాహనదారులు అదుపుతప్పి పడిపోయి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు మరమ్మత్తు పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



అన్నారం సమీపంలో లేచిపోయిన తారు

● సంక్షిప్తం..

● హుజూరాబాద్: మాదిగల ఐక్యత కోసం కృషి చేయాలని ప్రజా సంఘాలు, దళిత సంఘాల నాయకులు కోరారు. హుజూరాబాద్ పట్టణంలో మాదిగల ఐక్య సంక్షేమ సంఘం నాయకులు ఆర్ సారయ్య, పవిత్రలు ఎన్నిక కాగా శుక్రవారం ప్రజా సంఘాలు, దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో సన్మానించారు.

● తిమ్మాపూర్: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిర్మించిన అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలకు వేసిన ముసుగులను తొలగించి ఆవిష్కరించేందుకు సహకరించాలని జేఏసీ మండల నాయకులు శుక్రవారం ఆర్టీసీ ఆర్ఎం బి రాజును కలిసి వినతిప త్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మాతంగి శంకర్, దుంద్ర రాజయ్య, వంతడుపుల సంపత్, మాతంగి శంకర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ఈసీ మెంబర్‌గా ఎన్నికైనా తిమ్మాపూర్ మండలానికి చెందిన జర్నలిస్టు సిరిసిల్ల అనిల్‌కుమార్‌ను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సన్మానించారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల జర్నలిస్టులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

- మానకొండూర్ మండలంలోని లింగాపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రీన్ కో పెన్నార్ రెన్యువల్ ప్రైవేట్ లిమిటెడ్ వారు సీఎస్ఆర్ నిధుల నుంచి పాఠశాలలోని 73 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం మధుసూదనాచారి, గ్రీన్ కో సంస్థ ప్రతినిధులు ఆర్ సంజీవ్‌రెడ్డి, సాంబరెడ్డి, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

● చొప్పదండి: చొప్పదండిలోని బాలుర జడ్పీ ఉన్నత పాఠశలకు ఎన్ఆర్ఐ సిరిపురం రాంమూర్తి 60 వేల విలువగల ఆర్వో వాటర్ ప్లాంట్‌ను బహుకరించారు. ఈ మేరకు శుక్రవారం ఆర్వో ప్లాంట్‌ను రాంమూర్తి తల్లిదండ్రులు సిరిపురం రాజేందర్-రమలు ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైద్యుల రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన నీరటి కిరణ్ పది రోజుల క్రితం మృతి చెందగా బాల్యమిత్రులు అతడి కుటుంబానికి రూ.22,500ల నగదును శుక్రవారం అంద జేశారు. కార్యక్రమంలో ఇజ్జిగిరి శ్రీకాంత్, ఇజ్జిగిరి సంపత్, విజేందర్‌రెడ్డి, వంగల సాగర్‌రెడ్డి, చందర్ తదితరులు పాల్గొన్నారు.